
సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025



సీసలిలో 144 సెక్షన్

సీసలిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మంగళవారం నుంచి 15 రోజులపాటు గ్రామంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. 8లో ▸



సమస్యలతో సావాసం

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఏడాది కాలంగా ఇన్‌చార్జి అధికారుల పాలనతో రోజురోజుకూ పరిస్థితులు దిగజారుతున్నాయి. నిరంతరం సమస్యలు చుట్టుముడుతున్నాయి. 8లో ▸



రోడ్డెక్కిన రైతులు

పోలవరం మండలం ప్రగఢపల్లిలో యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. మంగళవారం సొసైటీ గోడౌన్‌కు సరిపడా యూరియా రాక పోవడంతో రైతులు ఆగ్రహించారు. 8లో ▸

న్యూస్‌రీల్

అధినేతతో భేటీ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన కారుమూరి, సునీల్‌కుమార్

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం మాజీ మంత్రి, రీజనల్ కో–ఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కారుమూరి సునీల్‌కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిసి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమ పరిపాలనపై చర్చించినట్లు కారుమూరి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం సంయుక్త కార్యదర్శిగా చిట్టిబాబు



పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం సంయుక్త కార్యదర్శిగా యలమంచిలి మండలానికి చెందిన మామిడిశెట్టి చిట్టిబాబును నియమించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి.

ఉపాధి హామీ వేతనాలు చెల్లించాలి



భీమవరం కలెక్టరేట్‌లో డ్వామా పీడీ అప్పారావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: జిల్లాలో ఉపాధి హామీ వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పనిచేసిన 15 రోజుల్లో వేతనాలు ఇవ్వాలని చట్టంలో ఉన్నా మూడు నెలలుగా ఇవ్వకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉపాధి కూలీల ఇబ్బందులను గుర్తించి వేతనాలు వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని జిల్లా డ్వామా పీడీ కెసీహెచ్ అప్పారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బల్ల చిన వీరభద్రరావు, శేషపు అక్రియ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు జక్కంశెట్టి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెలుగు వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



భీమవరంలో వెలుగు వీవోఏల జిల్లా మహాసభలో మాట్లాడుతున్న ధనలక్ష్మి

భీమవరం: వెలుగు వీవోఏల సమస్యలను తక్షణం పరిష్కరించాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పీడీ ఆఫీసులు ముట్టడిస్తామని వెలుగు వీవోఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భీమవరం మార్కెట్ యార్డ్‌లో మంగళవారం వెలుగు వీవోఏల జిల్లా మహాసభ నాగిడి గోవిందమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ తమతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తుందని, యాప్‌ల ద్వారా పని భారం పెంచుతుంది కానీ సెల్‌ఫోన్లు ఇవ్వడం లేదని విమర్శించారు. సెల్‌ఫోన్స్ ఇస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచినా నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. జూమ్ మీటింగ్ పేరుతో వీవోఏలను రాత్రి, పగలు వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకపక్క విపరీతంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుంటే మరోపక్క జీతాలు పెరగక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, రూ.10 లక్షలు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయు ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్, జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

12న స్థాయీ సంఘ సమావేశాలు

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 12 ఉదయం 10 గంటల నుంచి ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని జెడ్పీ సీఈఓ శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంక్షలు అధిగమించి.. అన్నదాత పోరు

- వైఎస్సార్‌సీపీ అన్నదాత పోరు విఫలయత్నానికి కూటమి కుట్రలు
- అడుగడుగునా పోలీసులతో ఆంక్షలు
- వెనక్కి తగ్గకుండా రైతు పోరును విజయవంతం చేసిన పార్టీ శ్రేణులు, రైతులు
- ఆర్డీఓ కార్యాలయాల్లో వినతి పత్రాల సమర్పణ

సాగును నిర్వీర్యం చేస్తూ కూటమి దగాకోరు పాలనపై కర్షకులు కదం తొక్కారు. అన్నదాత పోరు విఫలయత్నానికి ఆంక్షల రూపంలో ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు కల్పించినా లెక్కచేయకుండా విజయవంతం చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెంలోని ఆర్డీఓ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు.



నరసాపురం: భారీ ర్యాలీగా వెళుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు, మాజీ ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు, పాలకొల్లు ఇన్‌చార్జి గోపి

సాక్షి, భీమవరం/నరసాపురం/తాడేపల్లిగూడెం: పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని, రైతులందరికీ పూర్తిస్థాయిలో అన్నదాత సుఖీభవ పథకం వర్తింపచేయాలని తదితర డిమాండ్లతో రైతుల పక్షాన మంగళవారం వైఎస్సార్‌సీపీ నేతృత్వంలో అన్నదాత పోరు జిల్లాలో విజయవంతమైంది. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునందుకుని పార్టీ శ్రేణులు, రైతు సంఘాల నేతలు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

సర్కారు విఫల యత్నం

అన్నదాత పోరును అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం విఫలయత్నం చేసింది. సెక్షన్ 30 అమల్లో ఉందని, ర్యాలీలకు అనుమతిలేదంటూ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ల నివాసాలు, పార్టీ కార్యాలయాల వద్ద పోలీసులను మోహరించి చెదరగొట్టే ప్రయత్నాలు చేసినా పార్టీ శ్రేణులు, రైతులు లెక్కచేయలేదు. నియోజకవర్గాల నుంచి ఆర్డీఓ కార్యాలయాలకు చేరుకుని ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. ఆర్డీఓ కార్యాలయాల వద్ద వినతిపత్రాలు అందజేసేందుకు పోలీసులు ఆంక్షలు పెట్టి పరిమిత సంఖ్యలో మాత్రమే అనుమతించారు.

నరసాపురంలో..

నరసాపురంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పాలకొల్లు కో–ఆర్డినేటర్ గుడాల శ్రీహరిగోపాలరావు, పార్టీ శ్రేణులు, రైతులు ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. అడుగడుగునా పోలీసులు మోహరించి అడ్డంకులు కల్పించినా లెక్కచేయకుండా నిరసన ప్రదర్శన కొనసాగించారు. రైతులను ఆదుకోవాలని, కూటమి సర్కారు కళ్లు తెరవాలంటూ దారిపొడవునా నినాదాలు చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద పోలీసులు గేటు మూసివేసి కొంత మందిని మాత్రమే లోపలికి అనుమతించారు. దీంతో సబ్ కలెక్టర్ కార్యాలయ గేటు వద్ద స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. అనంతరం ఆర్డీఓ దాసిరాజుకు వినతి పత్రం అందజేశారు.

తాడేపల్లిగూడెంలో..

మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ అబ్జర్వర్ ముదునూరి మురళీకృష్ణంరాజు పార్టీ కార్యాలయం వద్ద నుంచి భారీ ర్యాలీగా, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పెద్ద ఎత్తున తణుకు నియోజకవర్గ శ్రేణులతో కలిసి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఉన్న పోలీసులు పార్టీ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. మాజీ మంత్రులు కొట్టు, కారుమూరి, అబ్జర్వర్ మురళీకృష్ణంరాజులు రైతు సమస్యలను ఆర్డీఓ ఖతీఫ్ కౌసర్ బానోకు వివరించి వినతిపత్రం అందజేశారు.

భీమవరంలో..

రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం, భీమవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ చినమిల్లి వెంకటరాయుడు, ఉండి నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పీవీఎల్ నరసింహరాజు, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, పార్టీ శ్రేణులు, రైతులు ప్రదర్శనగా భీమవరం మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ యూరియా కోసం అవస్థలు పడుతున్న రైతులను ఆదుకోవాలంటూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడితే పోలీసులతో అడ్డుకోవాలని ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. భీమవరం కో–ఆర్డినేటర్ వెంకటరాయుడు మాట్లాడుతూ యూరియా కూడా సరఫరా చేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఉండి కో–ఆర్డినేటర్ పీవీఎల్ మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తే కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. మహిళ నేత ఉమాబాల మాట్లాడుతూ అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల కష్టాలు గుర్తించి వారి పక్షాన వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ పోరాటం సాగిస్తుందన్నారు.



తాడేపల్లిగూడెం: పార్టీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు



నరసాపురం: ఆర్డీఓ దాసి రాజుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



తాడేపల్లిగూడెం: ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న మాజీ మంత్రులు కొట్టు, కారుమూరి

కూటమి పాపాలు పండుతున్నాయి

గుడాల గోపీ, కన్వీనర్

14 నెలల పాలనలో కూటమి నేతల పాపాలు పండుతున్నాయని పాలకొల్లు నియోజకవర్గ కన్వీనర్ గుడాల గోపీ అన్నారు. యూరియా దొరక్క, పంట సాయం అందక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని వాపోయారు.

ప్రభుత్వ మెడలు వంచుతాం

ముదునూరి మురళీకృష్ణంరాజు

రైతుల పక్షాన పోరాడి ప్రభుత్వ మెడలు వంచుతాం. కష్టంలో రైతుల పక్షాన నిలబడాల్సిన కూటమి ప్రభుత్వం వారిని నిర్లక్ష్యం చేస్తోంది. ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా గాలికొదిలేసింది. జగన్ ప్రభుత్వం రైతులు నష్టపోయిన సందర్భంలో అన్ని రకాలుగా ఆదుకుంది.

చంద్రబాబు పాలన మొత్తం వంచనే

ముదునూరి ప్రసాదరాజు

చంద్రబాబు పాలన మొత్తం ప్రజలను మోసం చేయడం, వంచించడమేనని మరోసారి రుజువైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు విమర్శించారు. నరసాపురంలో మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందడం లేదన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటకు బీమా వంటి సదుపాయాలు లేవన్నారు. పంటను అమ్ముకునే పరిస్థితిలేని దయనీయ స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారని వాపోయారు. నేడు యూరియా సక్రమంగా దొరక్క రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. తమ గొంతు నొక్కాలని చూసినా ప్రజల కోసం వైఎస్సార్‌సీపీ బలంగా నిలబడుతుందన్నారు.

ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది

కొట్టు సత్యనారాయణ, మాజీ డిప్యూటీ సీఎం

కూటమి ప్రభుత్వం రైతుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. జగన్ పాలనలో ఏర్పాటు చేసిన వ్యవస్థలను మార్చేయాలని దుర్మార్గమైన ఆలోచనతో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రికి వ్యవసాయం అంటే అసహ్యం. పంటలకు యూరియా వేస్తే క్యాన్సర్ వస్తుందని సీఎం అంటున్నారని రైతులను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అబద్ధాలు చెప్పడంలో సిద్ధహస్తుడు చంద్రబాబు అని విమర్శించారు. యూరియాను కూటమిలోని ఒక పార్టీ నాయకులు దారి మళ్లిస్తున్నారు. రూ.200 నుంచి రూ.300 కోట్లు చేతులు మారాయని విమర్శించారు.

యూరియాకు తీవ్ర కొరత

కారుమూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి

యూరియాను నల్లబజార్‌లో కొనాల్సి వస్తోంది. రైతుల పక్షాన జగన్ నిలబడి నిరసన కార్యక్రమాలు చేపట్టాక కూటమి ప్రభుత్వం మేల్కొంటుంది. మామిడి, పొగాకు, పత్తి రైతులు ప్రభుత్వ తీరు వల్ల తీవ్రంగా నష్టపోయారు. ఉల్లి రైతుదీ అదే పరిస్థితి. కూటమి ప్రభుత్వంలో దళారీ వ్యవస్థ పెరిగిపోయింది. వైఎస్ జగన్ వ్యవసాయం పండుగ అంటే, ప్రస్తుత సీఎం దండగ అంటున్నారు. రాష్ట్రంలో రైతులకు యూరియా కొరత లేకుండా అందించాలి. రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగిస్తుంది.

యూరియా కోసం క్యూలైన్ కష్టాలు

శ్రీ రంగనాథరాజు, మాజీ మంత్రి

ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆచంట నియోజకవర్గ కన్వీనర్, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ 5 ఏళ్ల పాలనలో రైతులకు ఇలాంటి కష్టాలు లేవన్నారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌మార్కెట్‌ను ప్రోత్సహిస్తూ రైతుల నడ్డివిరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ మంత్రి రామానాయుడు సొంత ఇలాకా పాలకొల్లులో అక్రమ ఇసుక దందా సాగుతుందని విమర్శించారు. గోదావరి గట్లను కూడా అక్రమంగా తవ్వడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.



తాడేపల్లిగూడెం: ఆర్డీఓ కార్యాలయంలోకి వెళుతున్న మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు



నరసాపురం: ఆర్డీఓ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు



భీమవరం: ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న సమన్వయకర్తలు చినమిల్లి, పీవీఎల్, ఎమ్మెల్సీ కవురు, పార్టీ నేతలు ఉమాబాల, రఘురామ్ తదితరులు

సచివాలయ ఉద్యోగుల నిరసన



యలమంచిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

యలమంచిలి: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటికి వాట్సప్ గవర్నెన్స్ రిజిస్ట్రేషన్, క్లస్టర్ మ్యాపింగ్ పనులను సచివాలయ ఉద్యోగులతో చేయించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయం జేఏసీ పిలుపు మేరకు మంగళవారం సచివాలయ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి ఆ పనులను సచివాలయ ఉద్యోగులతో చేయించడం సచివాలయ ఉద్యోగుల ఆత్మ గౌరవానికి భంగం కలిగించేదిగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ మేరకు ఈఓపీఆర్డీ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు షేక్ ఉమర్ అలీషా, డియువి సత్యనారాయణ, గోనిపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

ఏలూరు (టూటౌన్): విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దని.. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఏలూరులో కొత్త బస్టాండ్ సమీపంలోని వంతెన వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అదానీ మీటర్లు వద్దు.. పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్, ఆర్.లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడారు. గత ఎన్నికల ముందు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండని లోకేష్ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రజలపై భారంపడేలా స్మార్ట్ మీటర్లు ఏ విధంగా బిగిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే వ్యాపార సంస్థలకు, షాపులకు స్మార్ట్ మీటర్లు బిగించారని ఈ స్మార్ట్ మీటర్లతో బిల్లుల భారం పెరిగిందన్నారు. ఇప్పుడు గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, దొంగ చాటుగా ప్రజలు ఆమోదం లేకుండా మీటర్లు బిగించడం దుర్మార్గమన్నారు. బిగించిన స్మార్ట్ మీటర్లకు బిల్లు ఇవ్వడం లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ట్రూ అప్ చార్జీలు పేరుతో ప్రజలపై రూ.12 వేల కోట్లు భారం వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పి.మంగరాజు, ఎస్.మహంకాళి రావు, తామా ముత్యాలమ్మ, నగర కార్యదర్శి పంపన రవి కుమార్, నగర కమిటీ సభ్యులు వైఎస్ కనకారావు తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు కొత్త బస్టాండ్ సమీపంలోని వంతెన వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

మల్టీపర్పస్ గోడౌన్లు వినియోగంలోకి తేవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో నిర్మాణం పూర్తయిన మల్టీ పర్పస్ గోడౌన్లను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సహకార శాఖలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు నాబార్డ్ మంజూరు చేసిన 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 24 మల్టీ పర్పస్ గోడౌన్స్‌లో 14 పూర్తి చేశామని, ఇంకా 10 నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. పూర్తయిన 14 గోడౌన్లు రిజిస్ట్రేషన్లను కూడా పూర్తి చేసి, పీఏసీఎస్‌లకు అప్పగించామన్నారు. ఇప్పటికే పూర్తయిన వాటిని వినియోగంలో తీసుకురావాలని ఆదేశించారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు



ట్రాలీలో ఫుడ్ తీసుకెళ్తున్న కాంట్రాక్టర్

సాక్షి స్పందన

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ద్విచక్ర వాహనంతో నేరుగా పేషెంట్ల వార్డులోకి వెళ్లి ఫుడ్ సప్లయి చేస్తున్న కాంట్రాక్టర్‌పై వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం సెలవులో ఉన్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధురి ఫోన్లో మాట్లాడుతూ పత్రికల్లో వచ్చిన వార్తపై నర్సింగ్ సిబ్బందికి మెమో ఇచ్చినట్లు తెలిపారు. మంగళవారం కాంట్రాక్టర్ ఫుడ్ ప్యాకెట్లు కాకుండా పాత్రల్లో ఫుడ్ తీసుకువచ్చారన్నారు. ఓ ట్రాలీలో డిష్‌లు ఏర్పాటుచేసి డెలివరీ చేసేలా చర్యలు చేపట్టామన్నారు. కాంట్రాక్టర్ నేడు వివరణ ఇస్తానని చెప్పినట్లు డాక్టర్ మాధురి తెలిపారు.

క్లుప్తంగా

నాసిరకం ఉల్లిపాయలు అమ్మలేం



ఉల్లి విక్రయాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ భానో

తాడేపల్లిగూడెం: కర్నూలు నుంచి వచ్చే ఉల్లి పాయలను కొనుగోలు చేయడానికి వ్యాపారులు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో వాటిని అమ్మలేకపోతున్నామని బ్రహ్మానంద రెడ్డి మార్కెట్‌లో వ్యాపారులు ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ భానోకు తెలిపారు. మార్కెట్‌లో ఉల్లి లావాదేవీలను మంగళవారం ఆర్డీఓ పరిశీలించారు. వ్యాపారవర్గ ప్రతినిధి నంద్యాల కృష్ణమూర్తి ఆర్డీఓతో మాట్లాడుతూ వచ్చిన ఉల్లి పాయల్లో నాణ్యత లేనందున పాట పెట్టినా కొనేందుకు ఎవ్వరూ లేని కారణంగా వీటిని విక్రయించలేకపోతున్నామన్నారు.

సారా బట్టీలపై దాడులు



అరెస్టు చేసిన వ్యక్తితో ఎక్సైజ్ అధికారులు

కామవరపుకోట:: ప్రొహిబిషన్, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం సారా బట్టీలపై దాడులను నిర్వహించి పలువురిపై కేసు నమోదు చేసినట్లు చింతలపూడి ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. చింతలపూడి మండలం తలార్లపల్లిలో 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, నిందితుల పరారీపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే కామవరపుకోట మండలం తాడిచెర్లలో పాత సారా కేసులో ఏ2 నిందితుడిగా పరారీలో ఉన్న వాక దేవాంజనేయులును అదుపులో తీసుకొని చింతలపూడి కోర్ట్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు చెప్పారు.

15న అథ్లెటిక్స్ జిల్లా జట్టు ఎంపిక

ఏలూరు రూరల్: ఈ నెల 27, 28, 29 తేదీల్లో ఏలూరులో రాష్ట్రస్థాయి బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు చేపట్టనున్నట్లు ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ఏలూరు జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నామని వెల్లడించారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో పోటీలు జరుగుతాయని, ఆసక్తి గలవారు 15వ తేదీ ఉదయం 8 గంటలకు పుట్టినతేదీ, ఆధార్ ధ్రువీకరణ పత్రాలతో ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంకు హాజరుకావాలన్నారు. వివరాలకు 86865 40555 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దళితులపై దాడులు దారుణం




అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు నాయకుల నిరసన

కాళ్ల: సీసలి గ్రామంలో దళితులపై దాడులను నిరసిస్తూ మంగళవారం గ్రామంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహనాడు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహనాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ మాట్లాడుతూ గత కొంతకాలంగా సీసలి గ్రామంలో రెండు వర్గాల మధ్య ఏర్పడిన భూ వివాదాన్ని అధికారులు పరిష్కరించలేకపోయారన్నారు. దళిత యువకులు, మహిళలపై దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు 307 కేసును పెట్టాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గుండె నగేష్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి కర్ని జోగయ్య, కోన జోసెఫ్ మీసాల జయరాజు, కాళ్ళ ఉండి అధ్యక్షుడు గుజ్జుల నిరీక్షణ రావు తదితరులు పాల్గొన్నారు.

పాలనలో విఫలం.. సమస్యలతో సావాసం

- నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఏడాదిగా ఇన్‌చార్జులే దిక్కు
- విద్యార్థులపై కొరవడిన పర్యవేక్షణ



నూజివీడు ట్రిపుల్ ఐటీ

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఏడాది కాలంగా ఇన్‌చార్జి అధికారుల పాలన కొనసాగుతుండటంతో రోజురోజుకూ పరిస్థితులు దిగజారుతున్నాయి. పాలనలో విఫలం కావడంతో నిరంతరం సమస్యలు చుట్టుముడుతున్నాయి. అకడమిక్ క్యాలెండర్ గాని, బీఓఎస్ సమావేశాలు గాని, ఇతర అకడమిక్ అంశాలపై సుదీర్ఘ అనుభవం కలిగిన నిష్ణాతులతో సంప్రదించకుండానే ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుంటూ ట్రిపుల్ ఐటీని పురోగమనంలోకి కాకుండా తిరోగమనంలోకి నెడుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలు గడిచినా నేటికి రెగ్యులర్ చాన్సలర్‌ను గాని, వైస్ చాన్సలర్‌ను గాని, నాలుగు ట్రిపుల్ ఐటీలకు డైరెక్టర్‌లను గాని నియమించలేదు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న ప్రొఫెసర్ సంద్ర అమరేంద్రకుమార్‌కు నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఇన్‌చార్జి డైరెక్టర్‌గాను, అలాగే ఆర్జీయూకేటీకి ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గాను నియమించింది. ఒకే వ్యక్తికి రెండు కీలకమైన బాధ్యతలు అప్పగించడంతో తలకు మించిన భారంగా మారింది. నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిరంతరం ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికే ఉన్న సమయం చాలక సతమతమవుతుంటే రిజిస్ట్రార్‌గా కూడా బాధ్యతలు ఉండటంతో మిగిలిన మూడు ట్రిపుల్ ఐటీలలో ఏ సమస్య ఉత్పన్నమైనా అక్కడికి ఉరుకులు, పరుగులు పెట్టాల్సి వస్తోంది. దీంతో దేనిపైనా శ్రద్ధ పెట్టలేక పాలన క్రమంగా బలహీనంగా మారి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. అలాగే ఇక్కడ పనిచేస్తున్న ఏఓ సైతం ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తుండగా ఇటీవలే ఏడాది కాలపరిమితి పూర్తవ్వగా మరలా ఒక నెల ఇన్‌చార్జి బాధ్యతలను పొడిగించారు. ప్రొఫెసర్‌పై ఎంటెక్ విద్యార్థి కత్తులతో దాడికి దిగడం చూస్తుంటేనే ఇక్కడ పాలన ఎలా ఉందో అర్థమవుతోంది.

టెండర్లు పిలవడంలో జాప్యం

సెక్యూరిటీ, హౌస్ కీపింగ్ ఏజన్సీల కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో మరలా ఏజెన్సీల ఎంపికకు టెండర్లు పిలవాల్సి ఉన్నా నెలలు గడుస్తున్నా ఇప్పటికీ టెండర్లు పిలవలేదు. ఇది ఎప్పటికీ పిలుస్తారో కూడా తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. అలాగే శ్రీకాకుళం, ఒంగోలు పీయూసీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు నూజివీడు క్యాంపస్‌లోనే తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో పరిపాలన లోపం కారణంగానే తెలుగు సబ్జెక్టు బోధనకు సంబంధించి మెంటార్లకు, సర్‌ప్లస్‌లో ఉన్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మధ్య వివాదం తలెత్తి కొద్దిరోజులు పాటు నడిచింది. ఈ వివాదాన్ని పరిష్కరించడానికి యాజమాన్యానికి తల బొప్పి కట్టింది. చివరకు మెంటార్లు వెనక్కు తగ్గడంతో ఎలాగోలా సమస్య సద్దుమణిగింది.

క్యాంపస్‌లోకి మందు సీసాలు

విద్యార్థులకు స్వేచ్ఛ ఎక్కువైపోవడంతో క్యాంపస్‌లోకి ఏకంగా మందుసీసాలే వచ్చేస్తున్నాయి. ఇటీవల పార్టీ చేసుకునేందుకు 10 మంది విద్యార్థులు మందు సీసాలను ఒక విద్యార్థితో తెప్పించుకోవడం తీవ్ర సంచలనంగా మారింది. ఆ విద్యార్థి గోడ దూకి వెళ్లి మద్యం సీసాలు తీసుకురావడం గమనార్హం. అలాగే క్యాంపస్‌లో బాలురకు, బాలికలకు వేరు వేరుగా ఫుడ్ కోర్టులున్నా బాలికలు కూడా బాలుర ఫుడ్‌కోర్టు వద్దకు వచ్చి బాలురతో దగ్గరగా కలిసి కూర్చొని తింటూ కాలక్షేపం చేస్తున్నారు. దీంతో ఫ్యాకల్టీ, సిబ్బంది ఫుడ్‌కోర్టు వైపు వెళ్లడమే మానివేశారు.

సెమిస్టర్ పరీక్షలు ఎత్తేశారు

దేశ వ్యాప్తంగా హైస్కూల్ స్థాయిలో విద్యార్థులకు ఉన్న వార్షిక పరీక్షలను ఎత్తేసి సెమిస్టర్ పరీక్షల విధానాన్ని తీసుకొస్తుండగా ట్రిపుల్ ఐటీలో మాత్రం పీయూసీ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఈ ఏడాది నుంచి సెమిస్టర్ పరీక్షలను ఎత్తేసి వార్షిక పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించారు. అధికార బాధ్యతలను చూస్తున్న వారికి అవగాహన లేకో, ఒకరిద్దరూ ఐఏఎస్ అధికారుల మెప్పు పొందడానికో గాని సెమిస్టర్ పరీక్షలను ఎత్తేసి వార్షిక పరీక్షలను ఏర్పాటుచేశారు. దీనికి గవర్నింగ్ కౌన్సిల్ అనుమతి గాని, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ అనుమతులు గాని ఏమీ లేవని ట్రిపుల్ ఐటీలోని అధ్యాపక వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో పురోగమిస్తుందో, తిరోగమిస్తుందో అర్థం కావడం లేదని అధ్యాపకులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పటిష్టమైన చర్యలు చేపట్టాలని సర్వత్రా అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్‌లో భారీ చోరీ

రూ.3 కోట్ల బంగారు ఆభరణాలతో ఆడిటర్ పరార్



కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్ వద్ద స్థానికులను విచారిస్తున్న పోలీసులు

చింతలపూడి: చింతలపూడి పట్టణంలోని కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్‌లో భారీ చోరీ జరిగింది. సుమారు రూ.3 కోట్ల విలువైన బంగారు ఆభరణాలతో అదే సంస్థలో పనిచేస్తున్న ఆడిటర్ వడ్లమూడి ఉమా మహేష్ పరారయ్యాడు. సంస్థ ఉద్యోగులు, ఖాతాదారులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి ఆడిటర్ మహేష్ మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక కనకదుర్గ ఫైనాన్స్ సంస్థకు చేరుకున్నాడు. మేనేజర్ యాదల ప్రవీణ్ కుమార్, క్యాషియర్ అమృతాల ఆషాలను బయటకు పంపించి 380 పాకెట్లలో ఉన్న గోల్డ్‌తో మహేష్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న సీఐ క్రాంతికుమార్, ఎస్సై సతీష్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. సాయంత్రం 5 గంటల సమయంలో తనకు హెల్త్ బాలేదని, కొబ్బరి నీళ్లు తీసుకురమ్మని తమను బయటికి పంపించి మహేష్ గోల్డ్ బ్యాగ్‌తో పరార్ అయినట్లు సంస్థ ఉద్యోగులు తెలిపారు. అతడు బంగారం ఉన్న బ్యాగ్‌తో ఏలూరు వైపు వెళ్లినట్లు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు



పోలవరం రూరల్: ప్రగఢపల్లి గ్రామంలో యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు



ఆగిరిపల్లి: సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు

పోలవరం రూరల్: పోలవరం మండలం ప్రగఢపల్లి గ్రామంలో యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. మంగళవారం సొసైటీ గోడౌన్‌కు 270 బస్తాల యూరియా వచ్చింది. సమాచారం తెలుసుకున్న రైతులు యూరియా దొరకదేమోననే ఆందోళనతో ఒక్కసారిగా గోడౌన్ వద్దకు వచ్చి గుమిగూడారు. ఎల్ఎన్‌డీపేట, జిల్లెళ్లగూడెం, వింజరం పంచాయతీ పరిధిలోని సుమారు 18 గ్రామాలకు చెందిన 500 మంది రైతులు యూరియా కోసం క్యూ కట్టారు. సరిపడా యూరియా లేదని అర్థమైన రైతులు ఆగ్రహించి రోడ్డెక్కారు. రైతులందరికీ యూరియా సరఫరా చేయాలని నినదించారు. సమాచారం తెలుసుకున్న పోలీసు వ్యవసాయ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పారు. మరో లారీ యూరియా మంగళవారం రాత్రికే వచ్చేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నామని, బుధవారం అందరికీ అందజేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

తీరని యూరియా కష్టాలు

ఆగిరిపల్లి: రోజులు గడుస్తున్నా రైతులు యూరియా కోసం పడుతున్న కష్టాలు తీరడం లేదు. మంగళవారం ఆగిరిపల్లి సొసైటీలో యూరియా పంపిణీ చేస్తారని సమాచారం రావడంతో ఉదయం నుంచి రైతులు బారులు తీరారు. 250 బస్తాలు ఉండగా ఒకొక్కరికి ఒక్క బస్తా యూరియా ఇచ్చారు. గంటల కొద్ది నిలబడితే మాకు ఇవ్వకుండా టీడీపీ వారికి ఇవ్వడం ఎంత వరకు సమంజమని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం ఆగిరిపల్లికి యూరియా వస్తుందని వ్యవసాయ అధికారి భవానీ తెలిపారు.

సీసలిలో 144 సెక్షన్ అమలు



తహసీల్దార్ కార్యాలయంలో ఇరువర్గాల నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

కాళ్ల: సీసలి గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మంగళవారం నుంచి 15 రోజులపాటు గ్రామంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఆకివీడు సీఐ జగదీశ్వరరావు, తహసీల్దార్ జి.సుందర్ సింగ్ తెలిపారు. సీసలిలో గ్రామదేవత పోలేరమ్మ గుడి పక్కన ఉన్న పోరంబోకు స్థలం విషయమై సోమవారం రాత్రి జరిగిన వివాదంలో పలువురికి గాయాలైన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం కాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో ఇరువర్గాల పెద్దలతో పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులు శాంతి సమావేశం నిర్వహించారు. సదరు వివాదాస్పద భూమిని ఇరిగేషన్ అధికారులు స్వాధీన పరుచుకోవాలని, ఇరిగేషన్ ఏఈ ఫణిశంకర్‌కు తహసీల్దార్ సూచించారు. గ్రామంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, ఎక్కడా గుంపులుగా గాని, ఐదుగురు కంటే ఎక్కువ వ్యక్తులు గాని ఉండరాదని స్పష్టం చేశారు. బయట నుంచి వచ్చి గ్రామంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మొగల్తూరు ముత్యాలమ్మ పూరిపాక దగ్ధం



మొగల్తూరులో దగ్ధమైన పూరిపాక

నరసాపురం రూరల్: మొగల్తూరు గ్రామదేవత నడివీధి ముత్యాలమ్మ అమ్మవారి పూరిపాక సోమవారం అర్ధరాత్రి దగ్ధమైంది. ఈ ఘటనతో భక్తులు, పరిసర గ్రామాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఆలయ ధర్మకర్త, కమిటీ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మత సామరస్యానికి ఇబ్బంది కలుగకుండా అధికార యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంది. అడిషనల్ ఎస్పీ వాసుపల్లి భీమారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ సమాచారం అందిన వెంటనే డీఎస్పీ శ్రీవేద, సీఐలు, ఎస్సైలు సంఘటనా స్థలంలోనే ఉన్నారన్నారు. ఇప్పటికే డాగ్‌స్క్వాడ్, వేలిముద్ర నిపుణులు వచ్చి సమాచార సేకరణలో నిమగ్నమయ్యారన్నారు. ఆలయ ధర్మకర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భీమారావు తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 2024, 2025 సంవత్సరాల్లో 75 శాతానికి పైగా మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు హెచ్‌సీఎల్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే యోహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీన ఏలూరులోని ఎస్ఆర్‌ఐ జూనియర్ కళాశాలలో ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఇందుకు గాను ముందుగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాంలో చేరడానికి ఆఫర్ లెటర్లు ఇస్తారన్నారు. టెక్ బీ ట్రైనింగ్ ప్రోగ్రాం కాలపరిమితి ఒక ఏడాది ఉంటుందన్నారు. ఇంటర్న్‌షిప్ సమయంలో అభ్యర్థికి నెలకు రూ. 10 వేలు స్టైఫండ్ అందిస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఏడాదికి రూ.2.20 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం లభిస్తుందన్నారు. వివరాలకు హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రతినిధి సాయి కిరణ్‌ను 96429 73350 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఉద్యోగాలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ అమరేంద్రకుమార్, ఏఓ లక్ష్మణరావు

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో నాలుగో సంవత్సరం ఈసీఈ చదువుతున్న విద్యార్థులు ఇద్దరు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విద్యార్థి యుగంధర్ ఓమ్నీ డిజైన్స్ అనే కంపెనీకి ఇంటర్న్‌షిప్‌తో పాటు ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఇంటర్న్‌షిప్‌లో నెలకు రూ.50 వేలు ఏడాది పాటు ఇవ్వనున్నారు. అనంతరం ఏడాదికి రూ.18 లక్షల వార్షిక వేతనాన్ని కంపెనీ ఆఫర్ చేసింది. అలాగే మరో విద్యార్థిని కమలప్రియ ఎన్ఎక్స్‌పీ సెమీ కండక్టర్ కంపెనీకి ఎంపికైంది. ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్‌కు వెళ్లనుంది. ఇంటర్న్‌షిప్‌లో నెలకు రూ.40 వేల స్టైఫండ్‌ను కంపెనీ అందించనుంది. అనంతరం ఏడాదికి రూ.25 లక్షల వార్షిక వేతనంను అందించనుంది. విద్యార్థులను నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్, ఏఓ బీ లక్ష్మణరావు అభినందించారు.

మద్యానికి బానిసై..

ఉంగుటూరు: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి విపరీతంగా మద్యం సేవించి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుళ్లపాడుకు చెందిన షేక్ అల్లాబోసు భార్య రెండేళ్ల క్రితం మరణించింది. భార్య మరణాన్ని జీర్ణించుకోలేక అల్లాబోసు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 7వ తేదీన విపరీతంగా మద్యం సేవించి అపస్మారక స్థితిలో పడి ఉండడంతో అతడిని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సోమవారం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

భూసేకరణ అంటూ దళారుల దందా?

సాక్షి టాస్క్‌ఫోర్స్: కుక్కునూరు మండలంలోని ముంపునకు గురికాని భూములను ప్రభుత్వం సేకరించనుందంటూ కొందరు దళారులు కొత్తరకం భూదందాకు తెరలేపారు. అల్లూరి జిల్లాలోని గిరిజన నిర్వాసితులకు భూమికి, భూమి క్రింద పరిహారం అందించేందుకు మండలంలోని ముంపులో లేని భూములను ప్రభుత్వం సేకరించనుందన్న వదంతులు కొన్ని రోజులుగా హల్‌చల్ చేస్తున్నాయి. దీనిని ఆసరాగా చేసుకోని కొందరు దళారులు రంగప్రవేశం చేశారు. తమకు ప్రభుత్వంలో ఉన్న పలుకుబడితో భూములకు పరిహారం ఇప్పిస్తామంటూ భూయజమానుల వద్ద నుంచి పట్టాదారు పాస్‌బుక్‌ల జిరాక్స్‌లను సేకరిస్తున్నారు. ఎకరాకు కొంతమేర కమీషన్ ఇవ్వాల్సి ఉంటుందని ముందస్తుగా బేరసారాలు సాగిస్తున్నారు. దీంతో దళారుల మాటలు నమ్మి వారికి కొందరు పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్‌లను అందించగా, మరికొందరు డైరెక్ట్‌గా భూమి ఇచ్చేందుకు విల్లింగ్ అంటూ దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు

నిజంగా ప్రభుత్వం భూసేకరణ చేసేందుకు సిద్ధమైతే ముందస్తుగా అందుకు సంబంధించిన నోటిఫికేషన్ జారీచేయడం, ఆ తరువాత గ్రామసభ నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించడం, అవార్డ్ గ్రామసభలు నిర్వహించడం తదితర కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. ఇవేవి కాదని అసత్య ప్రచారాలు చేసే వారితో జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ విషయమై కుక్కునూరు తహసీల్దార్ రమేష్‌బాబుని వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ, భూసేకరణ విషయమై తమ వద్ద ఎటువంటి సమాచారం లేదన్నారు. దళారుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. అంతేకాక ఎవరైనా భూపరిహారం ఇప్పిస్తామంటూ బేరసారాలకు దిగి నిర్వాసితులను మోసగించేందుకు చూస్తే అలాంటి వారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మొబైల్ విప్లవంతో సాగు సమాచారం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ టి శ్రీనివాస్, మధుమంజురి

పెనుమంట్ర: మొబైల్ విప్లవం ద్వారా వ్యవసాయ సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు చేరవచేయాలనే ఉద్దేశ్యంతో కాబి ఇంటర్నేషనల్ సంస్థ ప్లాంట్‌వైజ్‌ప్లస్ అనే మొబైల్ అప్లికేషన్‌ని తీసుకువచ్చిందని మార్టేరు వరిపరిశోధనా స్థానం సహ పరిశోధనా సంచాలకులు టి.శ్రీనివాస్ తెలిపారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మార్టేరు, కాబి ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్లాంట్‌వైజ్‌ప్లస్ మొబైల్ అప్లికేషన్‌పై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డా.టి.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, కాబి సంస్థ నుంచి ముఖ్య అతిథిగా హాజరైన అగ్రి-డిజిటల్ కోఆర్డినేటర్ మధు మంజరి మాట్లాడారు. ఈ మొబైల్ సాధనం వ్యవసాయ నిపుణులకు తగిన సమాచారం అందిస్తుందని, తద్వారా వారు రైతులకు మెరుగైన సలహాలను అందించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. పంటపై పురుగుల నివారణకు సంబంధించిన పూర్తి సమాచారంతో పాటూ సిఫార్సుచేసిన పురుగు మందుల సమాచారం కూడా రైతులకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మార్టేరు, నెల్లూరు, బాపట్ల వరి పరిశోధనా స్థానానికి చెందిన శాస్త్రవేత్తలు, విస్తరణ కేంద్రాల శాస్త్రవేత్తలు, వివిధ డివిజన్‌ల వ్యవసాయ సహాయ సంచాలకులు పాల్గొన్నారు.

భీమవరంలో కలెక్టరేట్ కోసం దీక్ష



దీక్షకు మద్దతు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు చినిమిల్లి వెంకటరాయుడు, గూడూరి ఉమాబాల

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక మార్కెట్ యార్డ్‌లోనే కలెక్టరేట్ భవనం నిర్మించాలని భీమవరానికి చెందిన న్యాయవాది జవ్వాది సత్యనారాయణ (సత్తిబాబు), రాట్నాల శ్రీనివాసరావు స్థానిక ప్రకాశం చౌక్ సెంటర్‌లో మంగళవారం రిలే నిరహార దీక్ష చేపట్టారు. గతంలో ఇచ్చిన జీవో ప్రకారం మార్కెట్‌యార్డ్‌లోనే కలెక్టరేట్ నిర్మాణం చేపట్టాలని, భీమవరం నుంచి కలెక్టరేట్ తరలింపు ప్రయత్నాలు మానుకోవాలని కోరారు. రిలే నిరాహార దీక్షలకు వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపింది. వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చినిమిల్లి వెంకటరాయుడు దీక్షాదారులకు సంఘీభావం ప్రకటించారు. భీమవరంలోనే కలెక్టరేట్ ఉండాలని పోరాటం చేసే ప్రతి ఒక్కరికీ పార్టీ తరుపున మద్దతు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు గాదిరాజు రామరాజు, పాలవెల్లి మంగ, బొత్స ధర్మ తదితరులు పాల్గొన్నారు. దీక్షకు సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు మద్దతు తెలిపారు.

కైకలూరు కేసులో మరొకరి అరెస్ట్

ఏలూరు టౌన్, కైకలూరు:: ఈనెల 5న కైకలూరు దానగూడెంలో దళితులపై జరిగిన దాడి కేసుకు సంబంధించి మంగళవారం ఏ4 నిందితుడు జనపాల నాగశివ అలియాస్ మెకానిక్ శివను అరెస్ట్ చేసినట్లు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ కేసులో బాధితుడు పైయెద్దు అజయ్ ఫిర్యాదు మేరకు ఇప్పటికే ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఏలూరు జిల్లాలో 30పోలీస్ యాక్ట్, 163 బీఎన్ఎస్ (144 సీఆర్‌పీసీ) అమల్లో ఉందనీ, కైకలూరు పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ రీత్యా ప్రజలు ఎవరూ గుంపులుగా ఉండకూడదనీ, ముందస్తు అనుమతి లేకుండా సభలు, ర్యాలీలకు అనుమతి లేదన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం: వ్యక్తి అదృశ్యంపై అతని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ జీజీఎస్ఎస్ చక్రవర్తి తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం కుందర్ల గ్రామానికి చెందిన గొణంగి సాంబశివమూర్తి పడాలు తన స్నేహితులతో కలిసి ఉండి మండలం చిలుకూరులో చేపల చెరువు వద్ద పనిచేస్తున్నాడు. ఆగస్టు 20న కుందర్ల గ్రామానికి బయల్దేరిన సాంబశివమూర్తి పడాలు భీమవరం ఆర్టీసీ బస్టాండ్‌లో కనిపించకుండా పోయాడని తండ్రి చిట్టి పడాలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లోక్ అదాలత్‌లో టెలిఫోన్ బిల్లుల బకాయిల పరిష్కారం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బీఎస్ఎన్ఎల్ బిల్లులు బకాయిలు పడ్డ వినియోగదారులు ఈ నెల 13న జరిగే లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా టెలికాం జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

థింక్ ఇండియా దక్షిణాపథ్ సమ్మిట్ పోస్టర్ ఆవిష్కరణ



నిట్‌లో పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): థింక్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో తమిళనాడులోని ఐఐటీ మద్రాసు (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్)లో నిర్వహించనున్న దక్షిణాపథ్ సమ్మిట్ పోస్టర్‌ను ఏపీ నిట్‌లో మంగళవారం నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధ వంటి అధునాతన సాంకేతికతను ఉపయోగించి విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, యువత సృజనాత్మక ఆలోచనలు, ప్రతిభను సద్వినియోగం చేసుకుని దేశాన్ని ప్రపంచ దేశాలకు దీటుగా పురోగతివైపు నడిపించడం వంటి అంశాలపై నిపుణులు చర్చించనున్నారని చెప్పారు. పోస్టర్ ఆవిష్కరణలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకరరెడ్డి, అసోసియేట్ డీన్‌లు డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ కార్తికేయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రైతు కష్టాలు కూటమికి పట్టవా?


అన్నదాత పోరు కార్యక్రమానికి ర్యాలీగా వెళ్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



దువ్వలో అన్నదాత పోరుకు బయలుదేరుతున్న మాజీ మంత్రి కారుమూరి, పార్టీ శ్రేణులు

- అన్నదాత పోరు ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రులు కొట్టు, కారుమూరి
- తాడేపల్లిగూడెం, తణుకు నుంచి భారీగా తరలివెళ్లిన పార్టీ శ్రేణులు

తణుకు అర్బన్: రైతాంగానికి యూరియా కూడా అందించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం పరిపాలన చేస్తుందని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. అన్నదాత పోరు కార్యక్రమానికి తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాలయానికి తణుకు నుంచి మాజీ మంత్రి కారుమూరితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ పంట పుష్కలంగా పండి అధిక దిగుబడి వచ్చే క్రమంలో ఉపయోగించే యూరియా కోసం రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆయా సొసైటీల వద్ద క్యూలో నిలబడి ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని విమర్శించారు. పైగా యూరియా కోసం రైతులు అశ్రులు చాస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాత్రం యూరియా, పురుగుమందులు వాడకం వలన క్యాన్సర్ వంటి రోగాలు వస్తున్నాయని, తక్కువగా ఉపయోగించాలని వ్యాఖ్యానించడం బాధాకరమన్నారు. ఏ రైతును కదిలించినా తీవ్ర దుఃఖంలో ఉన్నారని పెట్టుబడి సాయంలేక, భారీ వర్షాలకు పంట నీటమునిగి ఇబ్బందులు పడ్డా ఇన్సూరెన్స్ అందించకపోవడం వంటి పరిస్థితుల్లో రైతులు అల్లాడిపోతున్నారని స్పష్టం చేశారు. ఇలానే కొనసాగితే వరి పండించే రైతు కనుమరుగైపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తణుకు మండలం దువ్వ గ్రామంలో కొంతదూరం ట్రాక్టరుపై ప్రయాణించారు. తణుకు నియోజకవర్గంలోని పట్టణం, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి తాడేపల్లిగూడెంకు పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్లు ఉండవల్లి జానకి, బుద్దరాతి భరణిప్రసాద్, పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యదర్శి వద్దూరి సీతారాం, లీగల్ సెల్ సభ్యులు వెలగల సాయిబాబారెడ్డి, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, తేతలి మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, దువ్వ సర్పంచ్ అడ్డా బాబు, పైబోయిన ఏసుబాబు, వీరమల్లు ఫణీంద్రకుమార్, కారుమంచి యోహాన్, పుల్లెపు సూరిబాబు, ఎస్వీ జాకబ్‌బాబు, పైడిసాయి సూర్య, వై.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్ : అన్నదాత పోరు పేరుతో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం డివిజన్‌లో నిర్వహించిన ర్యాలీ విజయవంతమైంది. ఈ ర్యాలీ మంగళవారం తాడేపల్లిగూడెం వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయం నుంచి తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వరకు ఎరువుల ధరలు నియంత్రించాలని, రైతులకు అసరమైన యూరియా ఎరువులు వెంటనే పంపిణీ చేయాలని, బ్లాక్ మార్కెట్ నియంత్రించాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఉచిత పంట బీమా అమలు చేయాలని నినాదాలు చేశారు. ఆకుపచ్చ కండువాలు ధరించి రైతులు ఈ ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నదాత పోరుకు తరలివెళ్లిన పార్టీ నాయకులు

పెంటపాడు: గూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి మండలం నుంచి భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం గూడెం తరలివెళ్లారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉండాలని, యూరియా కొరతను తీర్చాలని, రైతులను అన్నిరకాలుగా ఆదుకోవాలని నినాదాలు చేసుకొంటూ పలువురు మండల నాయకులు పలు వాహనాలపై గూడెం తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, విప్పర్రుకు చెందిన పార్టీ జిల్లా నాయకులు బోణం వీరయ్య, జామి కృష్ణ, కర్రి వరహాలరెడ్డి, పార్టీ బీసీ సంఘ రాష్ట్ర నాయకులు రెడ్డి సూరిబాబు, పెంటపాడు గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, భాస్కరరెడ్డి, ఉంగ్రాజవరపు రాజు, పొట్ల ఏడుకొండలు, బర్ల జయరాంబాబు, చోడగిరి చినబాబు, చల్లా లింగమూర్తి, మిరియాల శేషు, కొణతాల వెంకట్రావు, రైతు సంఘం నాయకులు వీరాబత్తుల నాగసత్యనారాయణ, జాలపర్తి నాగేశ్వరరావు, నిమ్మల పెదకాపు, సోమిశెట్టి శ్రీను తదితరులతో పాటు, పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


అన్నదాత పోరులో పాల్గొన్న గూడెం. తణుకు పార్టీ శ్రేణులు


దువ్వలో అన్నదాత పోరు కార్యక్రమంలో ట్రాక్టరుపై వెళ్తున్న మాజీ మంత్రి కారుమూరి

కొట్టు, కారుమూరి నాయకత్వంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన

తాడేపల్లిగూడెం: రైతులకు న్యాయం చేయాలి. యూరియాతో పాటు మిగిలిన ఎరువులను సకాలంలో రైతులకు అందజేయాలి. ఉయ్ వాంట్ జస్టిస్. జై.. జగన్ నినాదాలతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పిలుపు మేరకు మంగళవారం చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమం హోరెత్తించింది. తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల నుంచి విశేష సంఖ్యలో తరలివచ్చారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, గూడెం నియోజకవర్గ కన్వీనర్ కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆయన గృహం వద్ద భారీ సంఖ్యలో హెడ్‌పోస్టాఫీసు రోడ్డు, కేఎన్‌రోడ్డుమీదుగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. తణుకు నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు నాయకత్వంలో పార్టీ శ్రేణులు పట్టణంలోని పోలీ సు ఐలాండ్ మీదుగా ఫ్లైవోవర్ వంతెన మీదుగా ఎన్టీఆర్ చౌక్, తాలూకా ఆఫీసు సెంటర్ మీదుగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ పార్టీ శ్రేణులతో పాటుగా కొట్టుతో పాటు నర్సాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు కూడా ఆర్డీఓ కార్యాలయానికి తరలివచ్చారు. పార్టీ శ్రేణులు పోలీసు వలయాన్ని ఛేదించుకొని లోపలికి ప్రవేశించారు. తణుకు సర్కిల్‌కు చెందిన ఒక ఎస్‌ఐ అత్యుత్సాహంతో గూడెం పట్టణానికి చెందిన నాయకుడిని చొక్కా పట్టుకొని పక్కకు బలవంతంగా లాగేశారు. కొట్టు, కారుమూరి వెనుక పార్టీ శ్రేణులు ఆర్డీఓ కార్యాలయం వద్దకు చేరుకుని, ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ భానోకు రైతుల సమస్యలతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. సమస్యలను అధికారికి కొట్టు సత్యనారాయణ వివరించారు. నియోజకవర్గంలో జరుగుతున్న యూరియా అమ్మకాల అవకతవకలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పార్టీ శ్రేణులతో మాజీ మంత్రులిద్దరూ మీడియాతో మాట్లాడారు.

క్లుప్తంగా

ఎస్‌కేఎస్‌డీ కళాశాలలో వనం..మనం


మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్ లక్ష్మీసుందరీబాయ్, విద్యార్థినులు

తణుకు అర్బన్: వాతావరణ కాలుష్యాన్ని నివారించడం, పర్యావరణాన్ని పరిరక్షణ చేసే క్రమంలో మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయ్ అన్నారు. వనం మనం కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ఆవరణలో విద్యార్థినులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన అవసరం బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ సీహెచ్ రమేష్‌బాబు, కేవీ శ్యామలాదేవి, వలంటీర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

32 మందికి ఉచిత వైద్యం


తణుకులో ఉచిత వైద్య శిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ రమేష్‌చంద్రబాబు

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు 32 మంది వృద్ధులకు వైద్యసేవలు అందజేశారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన శిబిరంలో వైద్యులు రోగులకు ఉచితంగా బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులు తీసుకోవాల్సిన ఆహార అలవాట్లు, వ్యాయామం, నడక వంటి విషయాలపై వైద్యులు అవగాహన కల్పించారు. పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కార్యదర్శి కోసూరి గాంధీ, ఉపాధ్యక్షుడు ద్వారంపూడి బాపిరెడ్డి, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

మత్తు మందులపై అప్రమత్తంగా ఉండండి


అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్ట్ గంగాధర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): మత్తు మందులు శరీరాన్ని, మనస్సును నాశనం చేస్తాయని దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ దీక్ష డ్రగ్ ఎడిక్షన్ సెంటర్ సైకాలజిస్ట్ టి.గంగాధర్ పేర్కొన్నారు. ఆల్కహాల్, డ్రగ్స్ నివారణపై సొసైటీ వారిచే మంగళవారం యాగర్లపల్లిలోని ఆటో డ్రైవర్లుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ మత్తు మందులు, ఇతర వ్యసనాలు భారీన పడితే కుటుంబ జీవితం నాశనం అవుతుందని, ఆర్థిక పరిస్థితులు దెబ్బతింటాయని చెప్పారు. ఆరోగ్యకరమైన జీనవ శైలిని పాటిస్తే చెడు అలవాట్లు దరిచేరవన్నారు. వాటి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పార్ల వెంకటేష్, ఆటో డ్రైవర్లు యూనియన్ నాయకులు కట్రెడ్డి వెంకటేశ్వరరావు, డ్రైవర్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


ఆరవల్లి ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లక్ష్మి

అత్తిలి: బాలికల సంరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్య ఇస్తోందని ఐసీడీఎస్ మంచిలి సెక్టార్ పర్యవేక్షకురాలు వి.కనకమహాలక్ష్మి అన్నారు. మంగళవారం ఆరవల్లి ఉన్నత పాఠశాలలో ప్లస్ 2 విద్యార్థులకు మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమంలో భాగంగా కౌమార బాలికలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్తహీనతపై ఆరోగ్యశాఖ పర్యవేక్షకుడు దినేష్ వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండ్రాజవరపు రాణి, టీ మహాలక్ష్మి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు ఈఎస్‌ఐ సేవలు అందించాలి

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వం రైస్ మిల్లు కార్మికులకు, ఇతర కార్మికులకు ఈఎస్‌ఐ సేవలు అందించాలని రైస్‌మిల్లు కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఓ రైస్ మిల్లు కార్మికులతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు.

ఉచిత బస్సుతో రోడ్డున పడ్డాం

ఆటో డ్రైవర్ల ఆందోళన


ఆటో యూనియన్‌ల సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

తణుకు అర్బన్: స్త్రీశక్తి ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్ల జీవితాలు రోడ్డున పడ్డాయని ఆటో యూనియన్ అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షుడు, భారతమాత ఆటో యూనియన్ అధ్యక్షుడు పంగం రాంబాబు అన్నారు. తణుకు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలోని భారతమాత ఆటో యూనియన్ కార్యాలయంలో తణుకు ఏరియా ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం తణుకులోని 50 ఆటో యూనియన్‌ల నాయకులు, ఆటో డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఆర్టీసీ ఉచితబస్సు పథకాన్ని ప్రవేశపెడతామని ఎన్నికల ముందు ప్రకటించగానే ఆటో డ్రైవర్లు యూనియన్‌ల తరపున మేమంతా రాష్ట్ర వ్యాప్తంగా వ్యతిరేకించామని అయినప్పటికీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పథకాన్ని అమలుచేసి తమ కడుపులు కొట్టారని విమర్శించారు. తాము వ్యతిరేకిస్తున్న సమయంలో ఆటో డ్రైవర్లకు ఎటువంటి ఇబ్బందులులేకుండా పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు కానీ ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని అన్నారు. ఎవరి మీద ఆధారపడకుండా యువత, వృద్ధులు సైతం ఆటో రంగంలో ఉపాధి పొందుతున్నారని ఉచిత బస్సు పథకం కారణంగా నోటికందే కూడు కూడా కరువైందని, కుటుంబాన్ని పోషించుకునేందుకు నానాయాతన పడుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా పలు యూనియన్‌ల అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వం తమ ఉపాధి గండి కొట్టేలా వ్యవహరించిందని తమను ఆదుకునేందుకు చర్యలు చేపట్టని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమబాట పట్టనున్నట్లు చెప్పారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, ఏఐటీయూసీ నాయకులు బొద్దాని నాగరాజు, ఆటో యూనియన్‌ల న్యాయ సలహాదారు కామన మునిస్వామి ఆటో యూనియన్‌ల ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు. అనంతరం యూనియన్‌ల ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణలో భాగంగా నిరసనలు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు, భిక్షాటనలు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు, ఛలో కలెక్టరేట్ కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానాలు చేశారు. భారత మాత ఆటో యూనియన్ కార్యదర్శి కంచుమర్తి విశ్వేశ్వరరావు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన ఆర్‌సీడీఎస్ ప్రతినిధులు


మాజీ సీఎం జగన్‌ను కలిసిన రాష్ట్ర రెడ్డి కమ్యూనిటీ సొసైటీ ప్రతినిధులు

పెంటపాడు: రాష్ట్ర రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ (ఆర్‌సీడీఎస్) సంఘ ప్రతినిధులు మంగళవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ముదునూరుపాడుకు చెందిన జిల్లా ఆర్‌సీడీఎస్ సంఘ అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరెడ్డి వివరాలు వెల్లడించారు. రెడ్లు ఎదుర్కొంటున్న సమస్యలను జగన్ దృష్టికి తీసుకువచ్చామన్నారు. సంఘ నేషనల్ కన్వీనర్ వల్లపురెడ్డి వెంగళరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు యర్రపురెడ్డి సురేంద్రర్‌రెడ్డి, ఏపీ వర్కింగ్ అధ్యక్షుడు జయసింహారెడ్డి, రాష్ట్ర మహిళా కో–ఆర్డినేటర్ పద్మప్రియారెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పోతంశెట్టి లక్ష్మి, ఐటీ వింగ్ అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, రీజినల్ కో–ఆర్డినేటర్ వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు భయపరెడ్డి, వెలగల గణేష్‌రెడ్డి ఉన్నారు.

రైతులకు అవసరమైన ఎరువులను పంపిణీ చేయాలి


మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): యూరియాతో సహా రైతులకు అవసరమైన ఎరువులను పంపిణీ చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎరువుల బ్లాక్ మార్కెట్ పై అన్నదాత పోరు సందర్భంగా మంగళవారం పట్టణంలోని తాలూకా ఆఫీస్ సెంటర్‌లో మాలమహానాడు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంగరాజు మాట్లాడుతూ బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి ఎరువులను ప్రక్కతోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మాలలపై జనసైనికులు దాడులు చేస్తున్నారని, కైకలూరు దాన గూడెంలో, కాళ్లమండలంలోని సీసలిలో, పిఠాపురం నియోజకవర్గంలో జనసేన కార్యకర్తలు మాలలపై దాడులు చేశారని ఆరోపించారు.

పెన్షనర్స్ సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న హరికుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెన్షనర్స్ సమస్యలను పరిష్కరించాలని, రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని సంఘ యూనిట్ అధ్యక్షుడు హరికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో హరికుమార్ మాట్లాడుతూ పెన్షనర్స్ హెల్త్ కార్డులపై వైద్య సేవలు సరిగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సేవలను బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.బాలకృష్ణ, ముత్యాల అర్జునరావు, సజ్జ సత్యనారాయణ, గాజుల మురళీకృష్ణ, వంగపండు రామ్మోహన్‌రావు, వైవీఎస్ మూర్తి, ఎండీ బాషాతదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి


బీవీ నారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించుటలో ప్రభుత్వం మొండి వైఖరిని నిరసిస్తూ నిరసన వారం ఉద్యమ కార్యచరణ ప్రకటించారని, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ తెలిపారు. పట్టణంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు 15 నెలలు కావస్తున్నా బకాయిలు చెల్లింపులో జాప్యంచేస్తుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమానికి ఢోకాలేకుండా చూసే ప్రభుత్వం మాది అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారని, పెండింగ్‌లోఉన్న నాలుగు కరువు భత్యాలు (డి.ఎ) ఎప్పుడు విడుదల చేస్తారో మాట చెప్పలేదన్నారు. 12 పీఆర్‌సీ కమిషన్ నియమించి 30 శాతం ఐఆర్ (మధ్యంతరభృతి) ఎందుకు ప్రకటించడం లేదో చెప్పాలన్నారు. పాత పెన్షన్‌ను అమలు చేయాలని కోరారు. నిరసన వారంలో భాగంగా 11వ తేదీన నల్ల రిబ్బన్‌లతో నిరసన, 12వ తేదీన మండల కేంద్రాలలో నిరసన ప్రదర్శనలు, 13, 14 తేదీలలో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ ఇతర ప్రజా ప్రతినిధులకు మెమోరాండం సమర్పణ, 15వ తేదీన తాలూకా కేంద్రాలలో నిరసన, 16వ తేదీన జిల్లా కేంద్రంలో నిరసన, 17వతేదీన సీఎం, సీఎస్‌లకు వాట్సాప్, మెయిల్స్ సందేశాలు ఉంటాయని, సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేయడం చేస్తామన్నారు.

11న ఆరుగొలనులో ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను సొసైటీ వద్ద ఈ నెల 11న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి వీరవెంకట సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తాం


వాసవి క్లబ్ రీజియన్ సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలో క్లబ్ రీజియన్ సమావేశం ఆలపాటి రికాన్ లక్ష్మీ కృష్ణ వైభవం పేరిట మంగళవారం సాయంత్రం వాసవి కన్యకపరమేశ్వరీ ఆడిటోరియంలో జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎం.మురళీకృష్ణ కుమార్ పాల్గొన్నారు. రీజియన్ చైర్‌పర్సన్ ఆలపాటి లక్ష్మి మాట్లాడుతూ రీజియన్‌లోని అన్ని క్లబ్‌లు 9 నెలలు కాలంలో సుమారు 20 లక్షల రూపాయిలు విలువైన సేవా కార్యక్రమాలు చేయాలని తెలిపారు. సేవాలు చేసే వారికి అవార్డులు ఇచ్చి అభినందనలు చెప్పాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. నటరాజు, మారం వెంకటేశ్వరరావు, కేదార్ శెట్టి సునీత, ఏకాంబ్రేశ్వరరావు, ఎస్‌బీటీ సుందరం, పి.స్వర్ణకాంతి, శ్రీరామచంద్రమూర్తి, భాస్కరం, నాగసూరి మురళీ మోహన్, వలివేటి ప్రసాద్, పువ్వాడ సత్యనారాయణ మూర్తి, ఎస్‌ఎస్‌వీ చలపతిరావు మాట్లాడారు.

డంపింగ్ అక్కడ.. చెత్త ఇక్కడ..!

గ్రామాల్లో ఎస్‌డబ్ల్యుఎం షెడ్లు దుస్థితి


ఎల్.అగ్రహారం - పుల్లాయగూడెం రహదారి వెంబడి వేసిన చెత్తా చెదారం


అలంకారప్రాయంగా మారిన తాడేపల్లిగూడెం మండలం పుల్లాయగూడెం డంపింగ్ యార్డు

తాడేపల్లిగూడెం రూరల్: చెత్త నుంచి సంపద సృష్టి పేరిట గ్రామాల్లో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. కేవలం చెత్త నుంచి సంపద సృష్టిపై అవగాహన కార్యక్రమాలకు మినహా శాగ్రిగేషన్ జరిగిన దాఖలాలు లేవు. మండలంలోని 27 గ్రామాల్లోనూ చెత్త నుంచి సంపద కేంద్రాలు నిర్మించారు. ఒక్కో ఎస్‌డబ్ల్యుఎం షెడ్డు నిర్మాణానికి సుమారు రూ.5లక్షలు వెచ్చించారు. ఏళ్లు కావస్తున్నా నేటికీ చెత్త సంపద కేంద్రాల నుంచి పంచాయతీలకు రూపాయి వచ్చిన దాఖలాలు లేవు. దీన్ని బట్టి చెత్త సంపద కేంద్రాల్లో శాగ్రిగేషన్ ఏ విధంగా జరుగుతుందో అర్థమవుతుంది. డంపింగ్ యార్డు ఒక చోట ఉంటే గ్రామంలో సేకరించిన చెత్త మాత్రం ఆ సమీపాన రహదారి వెంబడి వేయడం విశేషం. దీంతో చెత్తా, చెదారాల నుంచి వస్తున్న దుర్గంధంతో ముక్కుపుటాలు బద్దలవుతున్నాయంటూ పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఏ గ్రామం చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్టుగా చెత్త సంపద కేంద్రాల తీరు నెలకొంది. ఇప్పటికైనా, అధికారులు స్పందించి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.